# 19వ అధ్యాయము

# యేసులో గల యదార్థములు

క్రొత్తనిబంధన గ్రంథము మొత్తములో "యేసులో", "యేసుతో", "యేసుకొరకు" మరియు అతనిలో అను వాక్యములను మనము కనుగొనెదము. యేసు మనకు చేసిన దానిని బట్టి విశ్వాసులమైన మనం కలిగి ఉండే ప్రయోజనం గురించి ఇవి మనకు తెలియజేస్తుంటాయి. దేవుడు మనలను పరీక్షించినట్లుగా మనకు మనం "క్రీస్తులో" పరీక్షించుకొన్నప్పుడు, దేవుడు కోరుకున్నట్లుగా మనం జీవించటానికి ఇవి సహాయపడతాయి. శిష్యులను చేయు సేవకుడు, క్రీస్తులో ఉన్న తన శిష్యుల యొక్క ఆత్మీయ ఎదుగుదలకు సహాయం చేస్తాడు, వారికి ఈ విధంగా బోధిస్తూ ఉంటాడు.

మొదట "క్రీస్తులో" ఉండటమంటే అర్థం ఏమిటి?

మనం ఎప్పుడైతే తిరిగి జన్మిస్తామో అప్పుడు మనం క్రీస్తు శరీరములో ఒక భాగమై ఆత్మీయంగా ఆయనలో ఒకటైపోతాము. దీనిని బలపరుస్తున్న క్రొత్త నిబంధనలోని కొన్ని వచనములను మనం తీసుకుందాం:

> అనేకులమైన మనము ***క్రీస్తులో*** ఒక్క శరీరముగా ఉండినాము (రోమా 12:5)
>
> అటువలె ప్రభువుతో కలిసికొనువాడు ***ఆయనతో ఏకాత్మయై యున్నాడు*** (1కొరింథీ 6:17)
>
> మీరు క్రీస్తుయొక్క ***శరీరమైయుండి వేరు వేరుగా అవయవములై యున్నారు*** (1కొరింథీ 12:27).

యేసు నందు విశ్వసించు వారమైన మనం క్రీస్తులో ఉన్నమా లేదా అనియు క్రీస్తులో ఒక్క శరీరముగా ఉన్నామా లేదా అనియు, మరియు ఆయనలో ఏకాత్మయై ఉన్నామా లేదా అనియు మనకు మనం పరీక్షించుకొనవలెను. ఆయన మనలోను, మనం ఆయనలోను ఉన్నాము.

మనం క్రీస్తులో ఒక్కటై ఉన్నందున కలిగెడి ప్రయోజనం గురించి తెలిపెడి ఒక వచనం ఇక్కడ ఇస్తున్నాను:

> అయితే ఆయన మూలముగా మీరు క్రీస్తుయేసునందున్నారు.. దేవుని మూలముగా ఆయన మనకు జ్ఞానమును నీతియు పరిశుద్ధతయు విమోచనమునాయెను (1కొరింథీ 1:30).

క్రీస్తునందు మనం నీతిమంతులుగా చేయబడతాము ("అపరాధులముగా" తీర్చబడము మరియు ఇప్పుడు ఏదిమంచో ఆ ప్రకారం చేయువారము), పరిశుద్ధులుగా చేయబడాతాము (దేవుని పవిత్రమైన కార్య కొరకు ఏర్పరచబడతాము), మరియు విమోచింపబడతాము (బానిసత్వము నుండి విమోచింపబడినవారము). మనం నీతిమంతులుగా

చేయబడుటకు రాబోవుకాలంలో ఇక ఎదురుచూడము, దానిబదులుగా మనం యేసులో ఉన్నాము కనుక ఇప్పుడా ఆశీర్వాదాలన్ని పొందియున్నాము.

క్రీస్తులో మన పూర్వపు పాపాలు క్షమించబడ్డాయి:

> ఆయన మనలను అంధకారసంబంధమైన అధికారములోనుండి విడుదలచేసి, తాను ప్రేమించిన తన కుమారునియొక్క రాజ్యనివాసులనుగా చేసెను. ఆ కుమారునియందు మనకు విమోచనము, అనగా ***పాపక్షమాపణ కలుగుచున్నది*** (కొలస్స 1:13-14).

మనం అంధకారసంబంధమైన అధికారం అనగా సాతాను రాజ్యములో ఇక ఎప్పటికి ఉండమని, వెలుగుసంబంధమైన రాజ్యం అనగా యేసు రాజ్యంలో ఉంటామని ఈ లేఖనాలు చెబుతున్నాయి.

> కాగా ఎవడైనను క్రీస్తునందున్నయెడల వాడు నూతన సృష్టి; పాతవి గతించెను, ఇదిగో క్రొత్తవాయెను (2కొరింథీ 5:17)

నీవు క్రీస్తు అనుచరుడివి అయివున్నట్లయితే, దేవుని స్తుతించు, సీతాకోకచిలుక రూపాంతరము చెందినట్లు నీవు ఇప్పుడు ఒక "క్రొత్త ప్రాణివి". నీ ఆత్మ ఒక క్రొత్త స్వభావాన్ని సంతరించుకుంటుంది. మునుపు నీ మనస్సులో సాతానుడు కలిగించే స్వార్థపు ఆలోచనలు ఇక కలిగి ఉండవు, అయితే ఇప్పుడు నీ "పాత స్వభావం గతించిపోయింది."

క్రీస్తులో ఉన్న అనేక ఆశీర్వాదాలు

> ***యేసుక్రీస్తునందు*** మీరందరు విశ్వాసమువలన దేవుని కుమారులైయున్నారు (గలతీ 3:26).

మనము పరిశుద్ధాత్మ ద్వారా పుట్టి, దేవుని యొక్క నిజమైన బిడ్డలము అయ్యామని తెలుసుకోవటం ఆశ్చర్యమనిపించుటం లేదా? ఎప్పుడైతే మనం ప్రార్థనలో ఆయనకు చేరువవుతామో, ఆయనను దేవునిగా కాక మన తండ్రిగా భావించి దగ్గరవుతాము.

> మరియు వాటియందు మనము నడుచుకొనవలెనని దేవుడు ముందుగా సిద్ధపరచిన సత్క్రియలు చేయుటకై, మనము క్రీస్తు యేసునందు సృష్టింపబడినవారమై ఆయన చేసిన పనియైయున్నాము (ఎఫెసీ 2:10)

దేవుడు మనలను కేవలం సృజించడమేకాదు, ఆయన తిరిగి మనలను క్రీస్తునందు సృజిస్తున్నాడు. ఇంతేకాకుండా దేవుడు "ముందుగానే సిద్ధపరచి ఉంచిన కార్యమును" నెరవేర్చుటకు, మనలో ప్రతి ఒక్కరికీ ఒక పరిచర్యను ముందుగానే నిర్ణయించి ఉన్నాడు. మనలో ప్రతిఒక్కరము ఒక దైవికమైన విధిని వ్యక్తిగతంగా కలిగియున్నాము.

> ఎందుకనగా మనమాయన యందు దేవుని నీతి అగునట్లు పాపమెరుగని ఆయనను మనకోసము పాపముగా చేసెను (2కొరింథీ

5:21).

## .దేవుడు చెప్పిన దానితో అంగీకరించుట

దురదృష్టవశాత్తు మనలో కొందరు మన గురించి దేవుని వాక్యము ఏమి చెబుతుందో దానిని వారు నమ్మరు, ఇది బైబిలుకు వ్యతిరేకంగా వారు మాట్లాడు మాటల ద్వారా తెలుస్తుంది. "నన్ను బలపరచు క్రీస్తు ద్వారా సమస్తం చేయగలను" అని చెప్పుట బదులు "నేను ఇది చేయగలనని అనుకోవటంలేదు" అని అంటుంటారు.

అటువంటి మాటలను బైబిలు, "చెడ్డ సమాచారముగా" పిలుస్తున్నది, ఎందుకంటే అవి దేవుడు చెబుతున్న వాటితో అంగీకరించటం లేదు (సంఖ్యా 13:32). అయితే మన హృదయము నిండా దేవుని వాక్యం నింపుకున్నట్లయితే ఆ లేఖనములయందు పూర్తి విశ్వాసం కలిగి వాటి ప్రకారమే మాట్లాడుతుంటాము.

## బైబిలు ప్రకారమైన ప్రకటనలు

మనం ఎవరమని దేవుడు చెబుతున్నాడో దానిని నమ్మి ఆ ప్రకారమే చెప్పాలి

మనం ఏదైతే చేయగలమని దేవుడు చెబుతున్నాడో అది మనం నమ్మి అలా చేయగలమని చెప్పాలి.

దేవుడు మనకు ఆయన ఎవరని చెబుతున్నాడో దానిని మనం నమ్మి ఆవిధంగా చెప్పాలి.

దేవుడు ఏదైతే చేస్తానని చెబుతున్నాడో దానిని నమ్మి ఆ ప్రకారంగా చెప్పాలి

విశ్వాసులందరూ ధైర్యంగా చెప్పగలిగే కొన్ని వాక్యములను ఇక్కడ ఇస్తున్నాను. క్రీస్తులో యదార్థంగా ఉండుటకు ఇవన్నియు తప్పనిసరి కాదు, కాని బైబిలు ప్రకారం ఇవన్నియు వాస్తవములు.

నేను క్రీస్తునందు విమోచింపబడి, పరిశుద్ధీకరించబడి, నీతిమంతునిగా చేయబడ్డాను (1కొరింథీ 1:30).

ఆయన మనలను అంధకారసంబంధమైన అధికారములోనుండి విడుదలచేసి, తాను ప్రేమించిన తన కుమారునియొక్క రాజ్యనివాసులనుగా చేసెను (కొలస్స 1:13).

క్రీస్తునందు నా పాపములన్నీ క్షమించబడ్డాయి (ఎఫెసీ 1:7).

నేను క్రీస్తునందు నూతన సృష్టి, నా పాత జీవితం గతించిపోయెను (2కొరింథీ 5:17)

నేను వాటియందు నడుచుకొనవలెనని దేవుడు ముందుగా సత్క్రియలను నా కొరకు సిద్ధపరచెను (ఎఫెసీ 2:10)

నేను క్రీస్తునందు దేవుని నీతిగా మారియున్నాను (2కొరింథీ 5:21)

నన్ను ప్రేమించిన క్రీస్తు ద్వారా వీటన్నిటిలో అత్యధిక విజయం పొందుచున్నాము (రోమా 8:37)

నన్ను బలపరచు క్రీస్తునందు నేను సమస్తమూ చేయగలను (ఫిలిప్పీ 4:13)

దేవుడు తన ఐశ్వర్యము చొప్పున క్రీస్తు యేసునందు మహిమలో నా ప్రతి అవసరం

తీర్చును (ఫిలిప్పీ 4:19).

సాతానుడి యొక్క అధికారమునకు దూరంగా క్రీస్తుతో కూడా పరలోకమందు నన్ను కూర్చుండబెట్టెను (ఎఫెసీ 2:4-6)

దేవుని ప్రేమించువారికి, అనగా ఆయన సంకల్పముచొప్పున పిలువబడినవారికి, మేలుకలుగుటకై సమస్తమును సమకూడి జరుగుచున్నవని యెరుగుదుము (రోమా 8:28).

దేవుడు మన పక్షముననుండగా మనకు విరోధియెవడు? (రోమా 8:31)

క్రీస్తు ప్రేమనుండి నన్ను ఏదియు ఎడబాపలేదు (రోమా 8:35-39)

నేను నమ్ముతున్నాను కనుక నాకు సమస్తమును సాధ్యమే (మార్కు 9:23)

నేను దేవునికి యాజకుడిని (ప్రకటన 1:6)

నేను దేవుని బిడ్డను గనుక, దేవుడు తన ఆత్మ ద్వారా నన్ను నడిపిస్తున్నాడు (రోమా 8:14)

నేను దేవుని వెంబడిస్తున్నాను కనుక నా మార్గము అంతకంతకు తేజరిల్లుచున్నది (సామె4:18)

కాబట్టి దేవుని చిత్తప్రకారమము బాధపడువారుసత్ ప్రవర్తన గలవారై,నమ్మకమైన సృష్టికర్తకు తమ ఆత్మలను అప్పగించుకొనవలెను(1పేతురు 4:19)

దేవుడు తన సేవనిమిత్తం వాడబడుటకు నాకు కృపావరములను అనుగ్రహించెను (1పేతురు 4:10-11).

నేను దయ్యములను వెళ్ళగొట్టుదును, రోగులు మీద చేతులుంచినప్పుడు వారు స్వస్థత నొందుదురు (మార్కు 16:17-18 చూడుము).

దేవుడు నన్ను ఎల్లప్పుడు క్రీస్తునందు విజయోత్సవముతో ఊరేగించుచున్నాడు (2 కొరింథీ 2:14 చూడుము).

నేను క్రీస్తుకు రాయబారినైయున్నాను (2 కొరింథీ 5:20 చూడుము).

నేను నిత్యజీవము కలిగియున్నాను (యోహాను 3:16 చూడుము).

నేను ప్రార్థన చేయునప్పుడు వేటిని అడిగితినో వాటన్నిటిని పొందియున్నానని నమ్ముచున్నాను (మత్తయి 21:22 చూడుము).

యేసు పొందిన గాయముల చేత నేను స్వస్థత నొందితిని (1పేతురు 2:24 చూడుము).

నేను ఈ లోకమునకు ఉప్పు మరియు వెలుగై యున్నాను (మత్తయి 5:13:14 చూడుము).

నేను దేవుని వారసుడినైతిని మరియు క్రీస్తుతోడి వారసుడినైతిని (రోమా 8:17).

నేను ఏర్పరచబడిన వంశములోను, రాజులైన యాజకసమూహములోను, పరిశుద్ధజనములోను మరియు దేవుని సొత్తయిన ప్రజలలోను ఒకడినైతిని (1పేతురు 2:9 చూడుము).

నేను క్రీస్తు శరీరములో ఒక అవయవమునై యున్నాను (1కొరింథీ 12:27).

యెహోవా నా కాపరి నాకు లేమి కలుగదు (కీర్తన 23:1).

యెహోవా నాకు వెలుగును రక్షణయునైయున్నాడు, నేను ఎవరికి భయపడుదును? (కీర్తన 27:1).

దీర్ఘాయువుచేత ఆయన నన్ను తృప్తిపరచును (కీర్తన 91:16).

ఆయన నా రోగములను భరించెను నా వ్యసనములను వహించెను (యెషయా 53:4-5)

ప్రభువు నాకు సహాయుడు, నేను భయపడను (హెబ్రీ 13:6).

నా చింత యావత్తు ఆయనమీద వేయుచున్నాను, ఎందుకనగా ఆయన నాగూర్చి చింతించుచున్నాడు (1పేతురు 5:7).

అపవాదిని ఎదిరించుడి, అప్పుడు వాడు మీయొద్దనుండి పారిపోవును (యాకోబు 4:7).

యేసు నిమిత్తము నా ప్రాణమును పోగొట్టుకొనుట ద్వారా దానిని దక్కించుకొనుచున్నాను (మత్తయి 16:25).

నేను క్రీస్తు దాసుడిని (1కొరింథీ 7:22).

నామట్టుకైతే బ్రదుకుట క్రీస్తే, చావైతే లాభము (ఫిలిప్పీ 1:21 చూడుము).

నా పౌరస్థితి పరలోకమునందున్నది (ఫిలిప్పీ 3:20).

నాలో సత్క్రియ నారంభించిన దేవుడు దానిని పూర్తిచేయును (ఫిలిప్పీ 1:6).

తన దయాసంకల్పము నెరవేరుటకై నాలో కార్యసిద్ధి కలుగజేయువాడు దేవుడే (ఫిలిప్పీ 2:13 చూడుము).

దేవుని వాక్యాన్ని ఆధారం చేసుకొని నేను ఏదైన చేయగలను అని ధైర్యంగా ప్రకటించుటకు ఇది ఒక మచ్చుతునక. ఈ నిజాలు మన హృదయంలో లోతుగా నాటుకున్నాయి అన్న నమ్మకం మనలో కలిగేవరకు ఈ ప్రకటనలను ధైర్యంగా చెప్పుటను ఒక అలవాటుగా చేసుకోవటం ఎంతైనా అవసరం. దేవుడు చెప్పిన దానికి మనం వ్యతిరేకముగా చెప్పుట లేదు అన్న నమ్మకం కలుగుటకు, మన నోటి నుండి వచ్చే ప్రతి మాటను జాగ్రత్తగా పరిశీలించవలెను.

